07-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - పాత భక్తులైన మీకు భక్తి ఫలాన్ని ఇచ్చేందుకు తండ్రి వచ్చారు, భక్తికి ఫలము జ్ఞానము, జ్ఞానము ద్వారానే మీకు సద్గతి లభిస్తుంది "

**ప్రశ్న:-** కొంతమంది పిల్లలు నడుస్తూ నడుస్తూ తమ అదృష్టాన్ని తామే షూట్ చేసుకుంటారు (కాల్చేసుకుంటారు), ఎలా?

**జవాబు:-** తండ్రికి చెందినవారిగా అయి సేవ చేయకుంటే స్వయం పై, ఇతరుల పై దయ చూపకపోతే, వారు తమ అదృష్టాన్ని తామే షూట్ చేసుకుంటారు అనగా పదభ్రష్టులైపోతారు. బాగా చదువుకొని యోగంలో ఉంటే మంచి పదవి లభిస్తుంది. సేవాధారులైన పిల్లలకు సేవ చేయాలనే ఆసక్తి చాలా ఎక్కువగా ఉండాలి.

**పాట :- ఈ రోజు ఉదయం ఉదయమే ఎవరు వచ్చారు..... (కౌన్ ఆయా సవేరే సవేరే.....)**

**ఓంశాంతి.** ఆత్మిక పిల్లలైన మీకు మేము ఆత్మలమని, శరీరాలు కాదని, పరమపిత పరమాత్మ నుండి ఈ జ్ఞానం ఇప్పుడే లభిస్తుందని మీ అర్థం చేసుకున్నారు. నేను వచ్చాను, ఇప్పుడు ఆత్మ అని నిశ్చయం చేసుకోండి అని తండ్రి చెప్పారు. ఆత్మయే శరీరంలో ప్రవేశిస్తుంది, ఒక శరీరం వదిలి వేరొక శరీరం తీసుకుంటూ ఉంటుంది. ఆత్మ మారదు, కానీ శరీరం మారుతుంది. ఆత్మ నాశనం కానిది(అవినాశి). కనుక స్వయాన్ని ఆత్మగా భావించాలి. ఈ జ్ఞానం ఎప్పుడూ, ఎవ్వరూ ఇవ్వలేరు. పిల్లల పిలుపు మేర తండ్రి వచ్చారు. ఇది పురుషోత్తమ సంగమ యుగమని ఎవ్వరికీ తెలియదు. మొత్తం కల్పంలో పురుషోత్తమ సంగమ యుగంలోనే నేను రావడం జరుగుతుంది. అప్పుడే మొత్తం విశ్వమంతా పురుషోత్తమంగా అవుతుందని తండ్రి అర్థం చేయిస్తున్నారు. ఈ సమయంలో మొత్తం ప్రపంచమంతా కనిష్ఠంగా, పతితంగా ఉంది. ఇది మృత్యులోకము, అది అమరపురము. మృత్యులోకంలో ఆసురీ గుణాలు కలిగిన మనుష్యులుంటారు, అమరలోకంలో దైవీ గుణాలు గల మనుష్యులుంటారు. అందుకే వారిని దేవతలని అంటారు. ఇక్కడ కూడా మంచి స్వభావం కలిగిన వారిని దేవతలాంటి వారని అంటారు. కొంతమంది దైవీ గుణాలు కలిగిన వారు కూడా ఉంటారు. ఈ సమయంలో అందరూ ఆసురీ గుణాలు గల మనుష్యులే! పంచ వికారాల్లో చిక్కుకొని ఈ దుఃఖం నుంచి తప్పించమని పాడుతూ ఉంటారు. ఏదో ఒక్క సీతను మాత్రమే రక్షించలేదు. భగవంతుడిని రాముడని అంటారని, భక్తులను సీతలని అంటారని తండ్రి అర్థం చేయించారు. వారు భక్తులకు ఫలం ఇచ్చేందుకు వస్తారు. ఈ అనంతమైన రావణ రాజ్యంలో చిక్కుకుపోయిన మొత్తం ప్రపంచాన్ని రక్షించి రామరాజ్యంలోకి తీసుకెళ్తారు. ఇది రఘుపతి రాఘవ రాజారాం సంగతి కాదు, అతను త్రేతాయుగపు రాజు! అతను కూడా ఇప్పుడు తమోప్రధానమైన జీర్ణావస్థలో ఉన్నాడు, మెట్లు దిగుతూ దిగుతూ క్రిందికి వచ్చేశాడు. పూజ్యుని నుండి పూజారిగా అయిపోయాడు. దేవతలు ఎవ్వరినీ పూజించరు. వారే పూజ్యులు! మళ్లీ వారే వైశ్యులుగా, శూద్రులుగా అవుతారు. అప్పుడే పూజ మొదలౌతుంది. వామమార్గంలోకి

రావటంతో పూజారులుగా అవుతారు. పూజారులు దేవతా చిత్రాల ముందు నమస్కరిస్తారు. ఈ సమయంలో ఒక్కరు కూడా పూజ్యులుగా లేరు. ఉన్నతాతి ఉన్నతమైన భగవంతుడు పూజ్యుడు - తర్వాత సత్యయుగ దేవతలూ పూజ్యులే! ఈ సమయంలో అందరూ పూజారులే! మొట్టమొదట శివుని పూజ జరుగుతుంది, అది అవ్యభిచారీ పూజ, అది సతోప్రధానమైనది. తర్వాత సతో, ఆ తర్వాత దేవతల పూజతో పాటు క్రిందకు దిగజారి జలాన్ని, మనుష్యులను, పక్షులను కూడా పూజించడం ప్రారంభిస్తారు. రోజురోజుకూ అనేకమందిని పూజిస్తారు. ఈ రోజుల్లో మత సదస్సులు కూడా చాలా జరుగుతూ ఉన్నాయి. ఒకసారి ఆదిసనాతన ధర్మమువారిది, ఒకసారి జైనులది, ఒకసారి ఆర్యసమాజం వారిది. చాలామందిని పిలుస్తారు. ఎందుకంటే ప్రతి ఒక్కరు తమ ధర్మమే గొప్పదని భావిస్తారు కదా! ప్రతి ధర్మములో ఏదో ఒక విశేష గుణమున్నందున వారు తమ ధర్మమే గొప్పదని భావిస్తారు. జైనుల్లో కూడా వివిధ రకాల వారుంటారు. 5-6 రకాలుంటారు. వారిలో కొంతమంది దిగంబరులుగా కూడా ఉంటారు. దిగంబరులంటే ఏమిటో అర్థమే తెలియదు. భగవంతుడు చెప్తున్నారు - “దిగంబరం అనగా అశరీరిగా వచ్చావు, మళ్లీ అశరీరిగా వెళ్ళాలి.” వారేమో వస్త్రాలు విసర్జించి దిగంబరులుగా అవుతున్నారు. భగవానువాచకు అర్థమే తెలియదు. తండ్రి చెప్పేదేమంటే - ఆత్మలైన మీరిక్కడకు శరీరం ధరించి పాత్ర పోషించేందుకు వచ్చారు. మళ్లీ తిరిగి వెళ్ళాలి, ఈ విషయాలు పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. ఆత్మనే తన పాత్ర అభినయించేందుకు వస్తుంది, వృక్షం వృద్ధి పొందుతూ ఉంటుంది. ఈ క్రొత్త క్రొత్త ధర్మాలు ఉత్పన్నమవుతూ ఉంటాయి. అందుకే దీనిని వెరైటీ నాటకమని అంటారు. ఇది రకరకాల(వెరైటీ) ధర్మాల వృక్షము. ఇస్లాం మతస్థులు చూడండి, ఎంత నల్లగా(అపవిత్రంగా) ఉన్నారో, వారిలో కూడా చాలా శాఖలు వెలువడ్తూ ఉంటాయి. మహమ్మద్ అయితే తర్వాతే వచ్చాడు. మొదటిది ఇస్లాం ధర్మము. ముస్లింల సంఖ్య చాలా ఉంది. ఆఫ్రికాలో ఎంత షాహుకార్లు ఉన్నారంటే వారికి బంగారు-వజ్రాల గనులే ఉన్నాయి. ఎక్కడైనా చాలా ధనం కనబడితే దాని పై దండెత్తి ధనవంతులుగా అవుతారు. క్రైస్తవులు కూడా ఎంత ధనవంతులుగా అయ్యారు! భారతదేశంలో కూడా ధనం ఉంది, కానీ గుప్తంగా ఉంది! బంగారం మొదలైన వాటిని ప్రభుత్వము వారు చాలా పట్టుకుంటూ ఉంటారు. ఇక్కడ దిగంబర్ జైన్ సభవారు సదస్సులు మొదలైనవి జరుపుకుంటూ ఉంటారు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమను తాము గొప్ప అని అనుకుంటారు కదా! ఇక్కడ ఇన్ని ధర్మాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. మరి ఇవన్నీ ఎప్పటికైనా వినాశనం అవ్వాల్సిందే. ఏమీ అర్థం చేసుకోరు. అన్ని ధర్మాలలో ఉన్నతోన్నతమైనది మీ బ్రాహ్మణ ధర్మమే. దీనిని గురించి ఎవ్వరికీ తెలియదు. కలియుగ బ్రాహ్మణులు కూడా చాలామంది ఉన్నారు. కానీ వారు గర్భజనిత బ్రాహ్మణులు. ప్రజాపిత బ్రహ్మ ముఖవంశావళి బ్రాహ్మణులైతే సోదరీ-సోదరులుగా ఉంటారు. ఒకవేళ వారు తమను బ్రహ్మ వంశస్థులనుకుంటే సోదరీ-సోదరులుగానే ఉండిపోవాలి గాని, ఒకరినొకరు వివాహము కూడా చేసుకోరాదు. వారు బ్రహ్మముఖవంశావళి బ్రాహ్మణులు కారని ఋజువు అవుతుంది. కేవలం పేరు పెట్టుకున్నవారే! వాస్తవానికి దేవతల కంటే ఉన్నతులు బ్రాహ్మణులని అంటారు, పిలక ఉంది కదా! ఈ బ్రాహ్మణులే మనుష్యులను దేవతలుగా చేస్తారు. చదివించేవారు పరమపిత పరమాత్మ, స్వయంగా జ్ఞానసాగరులు. ఇది ఎవ్వరికీ తెలియదు. తండ్రి వద్దకు వచ్చి బ్రాహ్మణులుగా అయి మళ్లీ రేపు శూద్రులుగా అయిపోతారు. పాత సంస్కారాలు

మార్చుకోవడం చాలా కష్టమనిపిస్తుంది. స్వయాన్ని ఆత్మగా నిశ్చయించుకొని తండ్రి నుండి వారసత్వం తీసుకోవాలి. ఆత్మిక తండ్రి నుండి ఆత్మిక పిల్లలే వారసత్వం తీసుకుంటారు. తండ్రిని స్మృతి చేయడంలోనే మాయ విఘ్నాలు కలుగజేస్తుంది. చేతులు పని చేస్తున్నా, హృదయంలో తండ్రిని స్మృతి చేయాలని తండ్రి చెప్తున్నారు. ఇది చాలా సహజం! ఎలా ప్రేయసీ - ప్రియులు ఒకరినొకరు చూసుకోకుండా ఉండలేరో అలా అందరికీ బాబా ప్రియుడే. బాబాను స్మృతి చేసే పిల్లలందరూ ప్రేయసులే. ఒక్క తండ్రి మాత్రమే ఎవ్వరికీ ప్రియురాలిగా అవ్వరు. ఎందుకంటే వారికంటే ఉన్నతులు ఎవ్వరూ లేరు. అయితే భక్తిమార్గం నుండి ప్రియుడనైన నాకు మీరందరూ ప్రేయసులే అని తండ్రి తన పిల్లలను మహిమ చేస్తారు. దుఃఖం నుండి తప్పించి, పావనంగా చేయమని పిలుస్తారు కూడా. మీరందరూ వధువులు, నేను వరుడను. మీరందరూ ఆసురీ జైలులో బంధీలుగా ఉన్నారు. నేను వచ్చి విడిపిస్తాను. ఇందులో చాలా శ్రమ ఉంది. నేరపూరిత దృష్టి(పతిత దృష్టి) మోసం చేస్తుంది. పవిత్ర దృష్టి గలవారిగా అయ్యేందుకు శ్రమ పడాల్సి ఉంటుంది. దేవతలకు ఎంత మంచి గుణాలున్నాయి. ఇప్పుడు అలాంటి దేవతలుగా చేయువారు చాలా అవసరం కదా!

సదస్సులో “మానవ జీవితంలో ధర్మం ఆవశ్యకత” అనే విషయం ఉంచారు. డ్రామాను అర్థము చేసుకోనందున తికమకపడి ఉన్నారు. మీరు తప్ప ఎవ్వరూ అర్థం చేయించలేరు. క్రైస్తవులు, బౌద్ధులు మొదలైనవారికి ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలైనవారు మళ్లీ ఎప్పుడు వస్తారో తెలియదు. మీరైతే వెంటనే ఈ లెక్కాచారం చెప్పేయగలరు. అయితే ధర్మం ఆవశ్యకత ఏమిటో అర్థం చేయించాలి కదా! మొట్టమొదట ఏ ధర్మం ఉండేది? తర్వాత ఏ ధర్మం వచ్చింది? మన ధర్మం వారు కూడా కొంతమంది పూర్తిగా అర్థం చేసుకోరు. యోగం చేయరు. యోగం లేకుండా శక్తి లభించదు. పదును నిండదు. ఒక్క తండ్రిని మాత్రమే సర్వశక్తుల అథారిటీ అని అంటారు. మీరు ఎంత సర్వశక్తివంతులుగా అవుతారంటే విశ్వానికే యజమానులుగా అవుతారు. మీ రాజ్యాన్ని ఎవ్వరూ దోచుకోలేరు. అప్పుడు మరి ఏ ఇతర ఖండమూ ఉండదు. ఇప్పుడైతే అనేక ఖండాలున్నాయి. ఈ సృష్టి చక్రం ఎలా తిరుగుతుందో చూడండి. ఇది 5 వేల సంవత్సరాల చక్రము. పోతే ఈ సృష్టి ఎంత పొడవుగా ఉందో ఎవ్వరూ కొలవలేరు. భూమి ఎంత విశాలంగా ఉందో కొలవగలరు. సాగరాన్ని అయితే కొలవలేరు. ఆకాశం, సాగరాల అంత్యాన్ని ఎవ్వరూ కనుక్కోలేరు. అందుకే ధర్మం ఆవశ్యకత ఎందుకో వారికి అర్థం చేయించాలి. మొత్తం చక్రమంతా ధర్మాల పైనే తయారయింది. ఇది వెరైటీ(రకరకాల) ధర్మాల వృక్షం. ఈ వృక్షం అంధుల ముందు దర్పణం వంటిది.

మీరిప్పుడు బయటి సేవకు బయలుదేరారు. నెమ్మది - నెమ్మదిగా మీ సంఖ్య వృద్ధి చెందుతూ ఉంటుంది. తుఫాను వస్తే చాలా ఆకులు రాలిపోతాయి కదా! ఇతర ధర్మాలలో తుఫాను వచ్చే ప్రసక్తే ఉండదు. వారైతే పై నుండి రావాల్సిందే! ఇక్కడ మీ స్థాపన చాలా అద్భుతమైనది. మొట్టమొదటి భక్తులు ఎవరైతే ఉన్నారో వారికే భగవంతుడు వచ్చి ఫలమునిస్తారు, తమ ఇంటికి తీసుకెళ్తారు. ఆత్మలైన మమ్మల్ని ఇంటికి తీసుకెళ్లమని పిలుస్తారు కూడా. తండ్రి స్వర్గ రాజ్యభాగ్యం ఇస్తారని ఎవ్వరికీ తెలియదు. సన్యాసులైతే సుఖం కావాలని కోరరు. వారు మోక్షాన్ని కోరుకుంటారు. మోక్షాన్ని వారసత్వం అని అనలేము. స్వయంగా శివబాబా కూడా తన పాత్ర పోషించాల్సి ఉంటే ఎవరినైనా

మోక్షంలో ఎలా ఉంచగలరు! బ్రహ్మకుమారీ-బ్రహ్మకుమారులైన మీరు స్వధర్మాన్ని, ఇతర ధర్మాలన్నిటిని తెలుసుకున్నారు. ఈ చక్ర రహస్యం అందరికీ అర్థం చేయించాలని మీకు జాలి కలగాలి. మీ ధర్మ స్థాపకులు వారి సమయాన్ని బట్టి మళ్లీ వస్తారని చెప్పండి, చెప్పేవారు కూడా చాలా తెలివైనవారుగా ఉండాలి. ప్రతి ఒక్కరూ సతోప్రధానం నుండి సతో-రజో-తమోలోకి రావాల్సిందేనని మీరు వారికి అర్థం చేయించవచ్చు. ఇప్పుడిది రావణ రాజ్యం. మీది సత్యమైన గీత. దీనిని స్వయం తండ్రియే వినిపిస్తున్నారు. భగవంతుడు నిరాకారుడని అంటారు. ఆత్మ నిరాకారుడైన తండ్రిని పిలుస్తుంది. అక్కడ ఆత్మలైన మీరుంటారు. మిమ్మలను పరమాత్మ అని అనరు. పరమాత్మ అయితే ఒకే ఒక్కరు. వారు ఉన్నతోన్నతమైన భగవంతుడు. మిగిలిన ఆత్మలన్నీ వారి పిల్లలు. సర్వుల సద్గతిదాత ఒక్కరే, ఆ తర్వాత దేవతలు. వారిలో కూడా నంబర్‌వన్ కృష్ణుడు. ఎందుకంటే అతని ఆత్మ, శరీరము రెండూ పవిత్రంగా ఉంటాయి. మీరిప్పుడు సంగమయుగ వాసులు. మీ జీవితం చాలా అమూల్యమైనది. దేవతలది కూడా అమూల్యము కాదు, బ్రాహ్మణుల జీవితమే అమూల్యమైనది. తండ్రి మిమ్మలను తన పిల్లలుగా చేసుకొని, మీ గురించి ఎంతో శ్రమ చేస్తున్నారు. దేవతలు ఇంత శ్రమ చేయరు. లౌకిక తండ్రి తన పిల్లలను చదివించేందుకు స్కూలుకు పంపిస్తారు. ఇక్కడ తండ్రే స్వయంగా కూర్చొని మిమ్మలను చదివిస్తున్నారు. వారు తండ్రి-టీచరు-గురువు. ముగ్గురూ వారే! కనుక వారిని ఎంత గౌరవించాలి? సేవ చేయగలిగిన పిల్లలకు సేవలో చాలా ఆసక్తి ఉండాలి. మంచి తెలివైనవారు చాలా కొద్దిమంది మాత్రమే సేవలో నిమగ్నమై ఉన్నారు. హ్యాండ్స్(సేవ చేసేవారు) కావాలి కదా. యుద్ధ మైదానంలోకి వెళ్ళేందుకు ఎవరికి శిక్షణనిస్తారో వారిని నౌకరీ మొదలైన వాటి నుండి విడిపిస్తారు. వారి వద్ద లిస్టు ఉంటుంది. వారు మిలట్రీ(సైన్యం)లోకి వెళ్ళము అని తిరస్కరించలేరు. మైదానంలోకి వెళ్ళము అని అనరాదు. డ్రిల్ నేర్పించి, అవసరమైనప్పుడు పిలిపించుకుంటారు. తిరస్కరించేవారి మీద కేసు పెడ్తారు. ఇక్కడైతే అలాంటిదేమీ ఉండదు. ఇక్కడ బాగా సేవ చేయలేకపోతే పదభ్రష్టులైపోతారు. సేవ చేయకపోవడం అనగా మిమ్మలను మీరే షూట్ చేసుకుంటారు, పదభ్రష్టులైపోతారు. మీ అదృష్టాన్ని మీరే షూట్ చేసుకుంటారు. బాగా చదువుకొని, యోగంలో ఉంటే మంచి పదవి లభిస్తుంది. మీ పై మీరు దయ చూపుకోవాలి. మీ పై మీరు దయ చూపుకుంటే ఇతరుల పై కూడా దయ చూపిస్తారు. తండ్రి అన్ని విధాలుగా అర్థం చేయిస్తూ ఉంటారు. ఈ ప్రపంచ నాటకం ఎలా నడుస్తుందో, రాజధాని స్థాపన కూడా ఎలా అవుతుందో తెలుపుతారు. ఈ విషయాలు ప్రపంచానికి తెలియవు. ఇప్పుడు సదస్సుకు ఆహ్వానమైతే దొరికింది. 5 -10 నిముషాలలో ఏం అర్థం చేయించగలము? ఒకటి, రెండు గంటలు ఇస్తే అర్థం చేయించగలము. డ్రామాను గురించి వారికి ఏ మాత్రం తెలియదు. అక్కడక్కడ మంచి పాయింట్లు వ్రాసుకోవాలి, కానీ పిల్లలు మర్చిపోతారు. తండ్రి సృష్టికర్త కూడా అయ్యారు. పిల్లలైన మిమ్మలను రచిస్తారు. తనవారిగా చేసుకున్నారు. డైరెక్టరుగా అయి డైరెక్షన్ కూడా ఇస్తారు. శ్రీమతము ఇవ్వడమే కాక, పాత్ర కూడా అభినయిస్తారు, జ్ఞానం కూడా వినిపిస్తారు. ఇది కూడా వారి ఉన్నతాతి ఉన్నతమైన కర్తవ్యము కదా. డ్రామా రచయిత, డైరెక్టర్, ముఖ్య యాక్టర్‌ను తెలుసుకోకుంటే ఏమి తెలుసుకున్నట్లు? అచ్ఛా.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ఈ అమూల్యమైన జీవితంలో చదివించే టీచర్‌ను చాలా చాలా గౌరవించాలి. చదువులో చాలా మంచి చురుకుగా ఉండి సేవలో నిమగ్నమవ్వాలి. మీ పై మీరే దయ చూపుకోవాలి.
2. మిమ్ములను మీరు సంస్కరించుకునేందుకు పవిత్ర దృష్టి గలవారిగా అవ్వండి. మీ నడవడికలు సంస్కరించుకోవాలి. మనుష్యులను దేవతలుగా చేసే సేవ చేయాలి.

## వరదానము :- " సంకల్పాలు మరియు మాటల విస్తారాన్ని సారములోకి తీసుకొచ్చే అంతర్ముఖీ భవ "

వ్యర్థ సంకల్పాల విస్తారాన్ని సర్దుకొని సార రూపంలో స్థితమవ్వాలి. నోటి ద్వారా వెలువడు వ్యర్థ మాటలను సర్దుకొని సమర్థము అనగా సార రూపంలోకి తీసుకు రావడమే అంతర్ముఖత. ఇటువంటి అంతర్ముఖీ పిల్లలే సైలెన్స్ శక్తి ద్వారా భ్రమించే ఆత్మలకు స్థిరమైన స్థానాన్ని చూపించగలరు. ఈ సైలెన్స్ శక్తి అనేక ఆత్మిక వైభవాలను చూపిస్తుంది. సైలెన్స్ శక్తి ద్వారా ప్రతి ఆత్మ మనసులోని శబ్ధము ఎవరో సమ్ముఖంలో చాలా సమీపంగా మాట్లాడుతున్నట్లు వినిపిస్తుంది.

## స్లోగన్ :- " స్వభావం, సంస్కారం, సంబంధం, సంపర్కంలో లైట్‌గా ఉండడం అనగా ఫరిస్తాగా అవ్వడం. "